# వెంటాడే దృశ్యాలు

కథ

యం. రమేష్‌కుమార్



అరుపులు.. కేకలు.. గోల...

ఆ ప్రాంతమంతా గందరగోళంగా ఉంది.

గుంపును చెదరగొట్టటానికి పోలీసులు లాఠీ ఛార్జి మొదలుపెట్టారు. ఆందోళనకారులను లాఠీలతో కొడుతూ తరమసాగారు.

పేదలకు భూములు పంచాలని ప్రతిపక్ష పార్టీలు చేస్తున్న ఆందోళనలో భాగంగా ప్రభుత్వ వైఖరికి నిరసన తెలియజేస్తూ ఆ రోజు బంద్ నిర్వహిస్తున్నారు.

ఆ సందర్భంగా నగరంలో ఓ చోట జరుగుతున్న ఆందోళనను పోలీసులు అదుపు చేయడానికి చేస్తున్న ప్రయత్నంలో భాగంగానే ఆ లాఠీఛార్జి జరుగుతోంది.

శేఖర్ కెమెరా హేండిల్ చేసుకుంటూ ఆ దృశ్యాల్ని చిత్రీకరిస్తున్నాడు.

సడన్‌గా పరిస్థితి ఉద్రిక్తమయింది.

ఆందోళనకారులు రాళ్ళు తీసుకుని పోలీసుల వైపు విసరసాగారు. చూస్తుండగానే పరిస్థితి అదుపు తప్పింది.

అదే సమయానికి పోలీస్ ఉన్నతాధికారి ఒకరు సంఘటన స్థలానికి చేరుకున్నారు.

పరిస్థితి చేయిదాటిపోతుండడంతో కొద్ది క్షణాల్లోనే ఫైరింగ్ ఆర్డర్స్ జారీ అయ్యాయి.

మొదట గాలిలోకి కాల్పులు జరిపిన పోలీసులు పరిస్థితి అదుపులోనికి రాకపోవడంతో తుపాకీ గుళ్ళను నేరుగా ఆందోళనకారుల మీదకి ప్రయోగించసాగేరు.

న్యూస్ ఛానల్ కెమెరామెన్ శేఖర్ తను ప్రమాదంలో ఉన్నట్టు గుర్తించేడు.. నిజానికి ఆ సమయంలో దృశ్యాలు షూట్ చేయడం చాలా రిస్కుతో కూడుకున్న పని.

ఆందోళనకారులు విసిరే రాళ్ళు తగులుతాయో... పోలీసుల బుల్లెట్లు తగులుతాయో తెలీని పరిస్థితి.

ఇంతలో శేఖర్‌కు సమీపంలోనే ఉన్న ఒక మహిళ పొత్తి కడుపులో బుల్లెట్ దిగబడింది. ఆమె పెద్దగా అరుస్తూ కిందికి ఒరిగిపోయింది. శేఖర్ కొద్దిగా ముందుకి పరిగెత్తి... ఆమెను కవర్ చేస్తూ కెమెరాతో క్లోజప్ షాట్ తీయసాగేడు.

ఈలోపు పోలీసులు ఆందోళనకారుల్ని తరుముతూ బుల్లెట్ల మోత మోగిస్తూ ముందుకి పోయారు.

కిందపడిపోయిన మహిళ పొత్తికడుపు మీద తడిమి చూసుకుని భయంతో చలించిపోతూ.. 'అమ్మా...' అంటూ మళ్ళీ పెద్దగా కేకపెట్టింది. ఆ తరువాత హిస్టీరిక్‌గా కేకలు పెట్టసాగింది.

క్రింద రక్తం మడుగు కడుతోంది. కెమెరాలో అంతా కవర్ అవుతోంది.

కొద్ది క్షణాల వరకూ అక్కడికెవరూ రాలేదు. ఆ తర్వాత మరో పక్క నుంచి పరిగెత్తుకు వచ్చిన మహిళలు ఆమెను లేవనెత్తి చీరచెంగు చించి కట్టుకట్టసాగారు. అప్పటికే ఆమె స్పృహ కోల్పోయింది.

□□□□□

సాయంత్రం... సుమారు ఏడున్నర గంటల సమయం....

రిలాక్స్‌డ్‌గా సోఫాలో కూర్చుని టివి చూస్తున్నాడు శేఖర్.

ఉదయం తను షూట్ చేసిన దృశ్యాలు.. 'జస్ట్ నౌ' న్యూస్ ఛానల్‌లో పదే పదే ప్రసారమౌతున్నాయి. మధ్య మధ్యలో అధికార, ప్రతిపక్ష పార్టీలకు చెందిన నాయకుల స్పందనలు...

ఈ సంఘటనలో వేడి తగ్గేంత వరకూ అది అలా ప్రసారమౌతూనే ఉంటాయన్న సంగతి శేఖర్‌కు తెలుసు.

పక్కనే కిరణ్మయి కూర్చునుంది. ఆమె కూడా తదేకంగా ఆ దృశ్యాలను చూస్తోంది.

బుల్లెట్ దిగబడిన మహిళ ఆర్తనాదం... అమ్మా..!

ఆ వెంటనే హిస్టీరిక్‌గా అరుపులు....

కిరణ్మయి వైపు చూసేడు శేఖర్. ఆమె కళ్ళల్లో అదోలాంటి ఆందోళన కదలాడుతోంది. 'బహుశా తను ఈ దృశ్యాలను ఎంత రిస్క్ తీసుకుని షూట్ చేసి ఉంటాడో... ఏదైనా ప్రమాదం జరిగుంటే ఏమయ్యేది...? అని ఆమె ఆలోచిస్తూండి ఉండొచ్చు' అనుకున్నాడు.

''కిరణ్... ఏమిటి ఆలోచిస్తున్నావు..? ఆ దృశ్యాలను తీయడంలో ఉన్న రిస్క్ గురించా..?'' అడిగాడు.

కిరణ్మయి తలూపింది... ఆ ఊపడం అవును, కాదుల మధ్యలో ఉంది.

''ఇవన్నీ ఈ వృత్తిలో సహజం...'' కిరణ్మయిని రిలాక్స్ చేయడానికి ప్రయత్నిస్తూ అన్నాడు శేఖర్.

**కిందపడిపోయిన మహిళ పొత్తికడుపు మీద తడిమి చూసుకుని భయంతో చలించిపోతూ.. 'అమ్మా...' అంటూ మళ్ళీ పెద్దగా కేకపెట్టింది. ఆ తరువాత హిస్టీరిక్‌గా కేకలు పెట్టసాగింది. క్రింద రక్తం మడుగు కడుతోంది. కెమెరాలో అంతా కవర్ అవుతోంది. కొద్ది క్షణాల వరకూ అక్కడికెవరూ రాలేదు. ఆ తర్వాత మరో పక్క నుంచి పరిగెత్తుకు వచ్చిన మహిళలు ఆమెను లేవనెత్తి చీరచెంగు చించి కట్టుకట్టసాగారు. అప్పటికే ఆమె స్పృహ కోల్పోయింది.**

టివిలో రిపీటవుతున్న దృశ్యం.

''అమ్మా..!'' మహిళ ఆర్తనాదం... ఆమె కంఠంలో స్పష్టంగా వినవస్తున్న భయం హృదయ విదారకంగా ఉంది.

కిరణ్మయి టి.వి. ఆఫ్ చేసింది.

''కిరణ్.. ఎందుకంత ఆందోళనగా కన్పిస్తున్నావ్..?'' శేఖర్ అనునయంగా అడిగాడు.

''శేఖర్... ఆ గుంపులో జొరబడి బులెట్ తగిలిన స్త్రీని కెమెరాతో షూట్ చేస్తున్నప్పుడు నీకేమీ అనిపించలేదా...?'' ...కిరణ్మయి భర్తను పేరుపెట్టి పిలుస్తుంది.

అఫ్‌కోర్స్... అందులో రిస్కున్న మాట నిజమే... అయినా రిస్కుకు భయపడితే సెన్సేషనల్ న్యూస్‌లు ఎలా కవర్ చేయగలం...?''

''నేననేది అదికాదు... బులెట్ తగిలిన తర్వాత బాణం దెబ్బతిన్న పావురంలా ఆమె కూలిపోతుంటే.. కొంతసేపటి వరకూ ఆమెకు సహాయం అందని సమయంలో... నువ్వు ఆ దృశ్యాన్నే కెమెరాతో కవర్ చేస్తూ... అప్పుడు... ఆ సమయంలో నీకేమీ అనిపించలేదా శేఖర్...?''

''నువ్వనేదేమిటి...?'' సాలోచనగా ఆమె వైపే చూస్తూ అడిగాడు శేఖర్.

''తీసిన దృశ్యాలు చాలు... కెమెరా పక్కన బెట్టి ఆమెకు హెల్ప్ చేద్దామనిపించలేదా..? కనీసం బుల్లెట్ దెబ్బ తిన్నచోట రక్తం కారకుండా కట్టుకట్టడానికి...''

ఆమె మాటల్ని మధ్యలోనే ఆపు చేస్తూ తీవ్రంగా అన్నాడు శేఖర్. ''నువ్వేం మాట్లాడుతున్నావో నాకర్థం కావడంలేదు కిరణ్... ఆ సమయంలో ఇంకా నేనక్కడ ఉండడమే రిస్క్.. అయినా నా డ్యూటీ నేను సమర్థంగా నిర్వహించాలి కాబట్టి...''

శేఖర్ మొహంలో కోపం స్పష్టంగా కన్పిస్తోంది. రిస్కు చేసి ఆ దృశ్యాలు చిత్రీకరించినందుకు కిరణ్మయి ఆందోళన చెందుతోందేమో అనుకున్నాడతను.

''శేఖర్.. ప్లీజ్... నేనన్న మాటలు వేరేగా తీసుకోవద్దు. నిన్నూ, నీ వృత్తినీ తప్పుపట్టాలని చెప్పడం లేదు. అసలు నేను ఆందోళన చెందుతున్న విషయం వేరే ఉంది. ఈ వృత్తిలో చేరాక నీలో సున్నితత్వం క్రమంగా మాయమైపోతోందేమో... అన్న భయం కలుగుతోంది నాకు. ఇప్పుడు నీ కెమెరాలో నిరంతరం ముసుగు కప్పుకొన్న ముఖాలు, హింసాత్మక సంఘటనలు, పరస్పర దూషణలు, క్షుద్ర రాజకీయ ఎత్తుగడలు, నెత్తురోడిన శరీరాలు... ఇవే కదలాడుతున్నాయి. రోజూ మళ్ళీ... మళ్ళీ.. అవే దృశ్యాలు. సంవత్సరం క్రితం వరకూ నీ కెమెరాలో దృశ్యాలు... నిజంగా అవెంత మనోహరమైన జ్ఞాపకాలు...! మరిచిపోయావా శేఖర్..?''

ఆమె కళ్ళల్లో గతానికి చెందిన దృశ్యాలేవో తిరుగాడాయి.

కిరణ్మయి మాటలకు శేఖర్ మౌనం వహించాడు.

అతని అంతరంగంలో ఏవో ఆలోచనలు కదలాడాయి...

కిరణ్మయిని ప్రేమించి పెళ్ళి చేసుకున్నాడు తను... పెళ్ళయ్యే నాటికి ఆమె బియస్సీ చేసింది. ఆ తరువాత శేఖర్ ప్రోత్సాహంతో కరస్పాండెన్స్ కోర్స్ ద్వారా ఎమ్మెస్సీ మ్యాథ్స్ పూర్తి చేసింది. ప్రస్తుతం జూనియర్ కాలేజీలో పార్ట్‌టైమ్ లెక్చరర్ పోస్టుకు ప్రయత్నిస్తోంది.

తను మొదట్లో ఒక యాడ్ కంపెనీలో కెమెరామెన్‌గా చేసేవాడు.. తను చిత్రీకరించిన యాడ్ ఫిలింస్‌లో దృశ్యాలు మాట్లాడేవి. చెప్పదలుచుకున్న భావాల్ని మనోహరంగా దృశ్యబద్ధం చేసేవాడు తను.. డైరెక్టర్ చెప్పిన సీన్‌ను విజువలైజ్ చేసే విషయంలో ఒక్కోసారి తనిచ్చే సూచ



తను న్యూస్ ఛానల్ కెమెరామెన్‌గా మారాక టివిలో తను తీసిన దృశ్యాలు వస్తున్నప్పుడు చూపించేవాడు.. కిరణ్మయి ఏ కామెంట్ చేసేదికాదు... కానీ క్రమక్రమంగా ఆమెలో పెరుగుతున్న ఒక రకమైన అసంతృప్తిని తను గమనించకపోలేదు... అయితే అదేమిటో తనకి స్పష్టంగా అర్ధంకాలేదు. కానీ.. ఈ రోజు... తన వృత్తిపట్ల కిరణ్మయి విముఖంగా మారుతోందన్న సంగతి ఆమె మాటల్లో స్పష్టంగానే తెలుస్తోంది.

నలు అద్భుతంగా వర్కవుట్ అయ్యేవి. యూనిట్‌లో అందరూ తనని అభిమానించే వారు. కిరణ్మయి తను తీసిన దృశ్యాల్ని ఆరాధించేది. వాటి గురించి, వాటిని చిత్రీకరించిన పద్ధతి గురించి తను చెప్పే విషయాల్ని ఎంతో ఆసక్తిగా వినేది. ఆ దృశ్యాల గురించి ఒక్కోసారి తామిద్దరూ ఎడతెగకుండా మాట్లాడుకొనేవారు...

కిరణ్మయి స్వభావం చాలా సున్నితం... ముఖ్యంగా ఆమె జంతుహింసను తీవ్రంగా వ్యతిరేకించేది. మాంసాహారం తినడం కూడా జంతు హింస కిందికే వస్తుందని వాదించేది. పెళ్ళికి ముందే మాంసాహారం పూర్తిగా మానేస్తానని ఆమెకు మాటిచ్చేడు తను. కానీ మాట నిలబెట్టుకోలేకపోయాడు. అప్పుడప్పుడూ బైట నాన్‌వెజ్ తినేవాడు. అయితే ఆ విషయం కిరణ్మయికి తెలీకుండా జాగ్రత్తపడేవాడు. కిరణ్మయి హింస ఉన్న సినిమాలకు కూడా వెళ్ళేది కాదు. టివిలో అటువంటి దృశ్యాలు వచ్చినా చటుక్కున చానెల్ మార్చేసేది.

తను న్యూస్ ఛానల్ కెమెరామెన్‌గా మారాక టివిలో తను తీసిన దృశ్యాలు వస్తున్నప్పుడు చూపించేవాడు.. కిరణ్మయి ఏ కామెంట్ చేసేది కాదు... కానీ క్రమక్రమంగా ఆమెలో పెరుగుతున్న ఒక రకమైన అసంతృప్తిని తను గమనించకపోలేదు... అయితే అదేమిటో తనకి స్పష్టంగా అర్ధం కాలేదు.

కానీ... ఈ రోజు.. తన వృత్తిపట్ల కిరణ్మయి విముఖంగా మారుతోందన్న సంగతి ఆమె మాటల్లో స్పష్టంగానే తెలుస్తోంది. కానీ... తనేం చేయగలడు..? కెమెరా తప్ప తనకి మరో ప్రపంచం తెలీదు. యాడ్ కంపెనీ కంటే ప్రస్తుతం తను చేస్తున్న జాబ్ కచ్చితంగా బెట్ ఛాయిస్.

కిరణ్మయి సున్నితమైన స్వభావానికి తన కెమెరా దృశ్యాలు ఇబ్బందిని కలిగిస్తూండి ఉండొచ్చు... కానీ మరో మార్గం ఏముంది?

శేఖర్ ఆలోచనల్లోంచి బయటపడి పక్కకు తిరిగి చూసేసరికి కిరణ్మయి లేదు. తనని ఆలోచనల్లో అలాగే వదిలి- ఆమె వంటింట్లో డిన్నర్ సిద్ధం చేస్తున్నట్లుంది.

రాత్రి పక్క మీదకు చేరాక కిరణ్మయిని అనునయంగా అడిగాడు శేఖర్... ''ఏమిటిది? ఎప్పుడూ లేనిది ఈ రోజు ఎందుకిలా ఎగ్జయిట్ అవుతున్నావు..? ఏమైంది కిరణ్?''

కిరణ్మయి 'కారణం చెప్తాను' అంటూ అలమరలో నుంచి ఓ జోక్స్ బుక్ తీసింది. 'రెండు రోజుల క్రితం చదివానిందులో జోక్.. రెండు గంటల క్రితం నీ కెమెరా చిత్రించిన దృశ్యాలు చూసాక ఈ జోక్ నాకు పదే పదే గుర్తొస్తోంది శేఖర్...'

శేఖర్ ఆ బుక్ తీసుకుని కిరణ్మయి చూపించిన జోక్ చదివేడు.

ఓ ఇద్దరు ఫొటోగ్రాఫర్లు సాయంత్రం ఓ చోట కలుసుకున్నారు. ఒకతను జాలిగా అన్నాడు. 'మధ్యాహ్నం నేనొక దారుణమైన దృశ్యం చూసాను గురూ..! పాపం ఓ ముసలిది చెత్త కుండీ పక్కనే ఎండలో మాడుతూ పడుకుని ఉంది. మూడు రోజుల్నుంచీ తిండి లేదు. వెంటనే తినడానికేమీ దొరక్కపోతే చచ్చిపోయేలా కనిపించింది.''

'అరెరె.. పాపం..'' జాలిపడ్డాడు రెండోవాడు. 'మరామెకు ఏమిచ్చావ్?'

''ఏవుందీ.. బాగా ఎండగా ఉంది కదా.. అందుకని 1/100లో ఎఫ్-16 ఇచ్చాను (ఫొటో తీసాను)'' తేలిగ్గా అన్నాడు మొదటివాడు.

జోక్ చదివాక ముందు నవ్వొచ్చినా.. ఆ జోక్‌ను కిరణ్మయి తన పరిస్థితికి అనువర్తించడాన్ని తల్చుకున్నాక చురుక్కుమన్నట్టనిపించింది.

శేఖర్‌కి కిరణ్మయి ఒకవైపు నుంచే ఆలోచిస్తోందనిపించింది. కొద్ది క్షణాలు ఆలోచించాక తనకి తెలిసిన కొన్ని విషయాలు... ఈ వృత్తి గొప్పదనం గురించి చెప్పేవి... చెప్పడం ద్వారా కిరణ్మయిని కన్విన్స్ చేయవచ్చనిపించింది.

ఆఫ్ఘన్, శ్రీలంక అంతర్యుద్ధాలను అత్యంత ధైర్యసాహసాలతో యుద్ధరంగంలోనే చిత్రీకరించిన మహిళా జర్నలిస్ట్ అనితకు తర్వాత జర్నలిజంలో అత్యంత ధైర్యసాహసాలు ప్రదర్శించిన వారికి ఇచ్చే అంతర్జాతీయ 'జార్జిపోర్క్' అవార్డు వచ్చింది. ఇంకో సంఘటనలో 'ఇండియా టుడే' ముఖ్య విలేకరి, ఫొటోగ్రాఫర్‌లు ఇద్దరూ 'లాతూర్' భూకంప సమయంలో 'నస్తూర్' అనే గ్రామంలో ఒక పాఠశాలలో వరుసగా పరచి ఉన్న మృతదేహాలను ఫొటోలు తీస్తుండగా.. తీవ్ర ఆవేదనతో రోదిస్తున్న ఒక మహిళ 'ఏం ఫొటోలు తీస్తున్నారు మీరు..? ఇదేమైనా మా అబ్బాయి పెళ్ళి అనుకున్నారా..?'' అని కేకలు పెట్టింది. అయితే ఆ తర్వాత 'ఇండియా టుడే' సంస్థ సిబ్బంది తమ ఒక రోజు వేతనాన్ని భూకంప బాధితులకు విరాళంగా ఇచ్చారు. యాజమాన్యం ఆ మొత్తానికి సమానమైన మొత్తాన్ని కలిపి ప్రధానమంత్రి సహాయనిధికి అందించింది. ఈ సందర్భంగా 'జర్నలిస్టులకు కూడా హృదయం ఉండాల్సిన చోటే ఉన్నదని నిరూపించే చిన్న సాక్ష్యమిది' అని ఇండియా టుడే చీఫ్ ఎడిటర్ అరుణ్‌పురి వ్యాఖ్యానించారు. ఈ సంఘటనల గురించి చెప్తూ...' జర్నలిస్టుల వైపు నుంచి కూడా ఎందుకు ఆలోచించవు..?' అడిగాడు శేఖర్.

'నిజమే కావచ్చు శేఖర్... కానీ నేనెందుకో ఈ పరిస్థితిని మామూలుగా తీసుకోలేకపోతున్నాను' అన్యమనస్కంగా చెప్పింది కిరణ్మయి.

శేఖర్‌కి ఇంక తనేవిధంగా కిరణ్మయికి నచ్చజెప్పగలడో అర్థం కాలేదు. ఆలోచిస్తూనే నిద్రలోకి జారుకున్నాడతను.

మర్నాడు ఉదయం శేఖర్ మూడీగా ఉండడం

చూసి ''నిన్నటి నా మాటలు నిన్ను బాధపెట్టాయా శేఖర్?'' అడిగింది కిరణ్మయి.

''లేదు.. లేదు.. కానీ ఈ విషయంలో నువ్వు అనవసరంగా ఎక్కువ ఆలోచిస్తున్నావేమో అన్పిస్తోంది కిరణ్.. నా కెమెరా దృశ్యాల్ని నువ్వు పట్టించుకోవాల్సిన అవసరమేముంది? నీకు న్యూస్ ఛానల్స్ చూడ్డం ఇష్టంలేకపోతే మానేయవచ్చు. నేను తీసిన దృశ్యాల్ని కూడా చూడక్కర్లేదు ఏమంటావ్?'' శేఖర్ అనునయంగా అన్నాడు.

'అదే... ఆ విషయంలోనే నేనూ బాధపడుతున్నాను. నువ్వు యాడ్ ఫిలిం చేసేటప్పుడు ఆ దృశ్యాల్ని చూడ్డం కోసం నేను తహతహలాడిపోయేవాణ్ణి. ఇప్పుడు నీ కెమెరా దృశ్యాలే కాదు... నీ మనసు కూడా క్రమక్రమంగా బండబారిపోతోందేమో అన్న అనుమానం వస్తోంది. కవిత్వం రాయడం మానేశావ్. నీ భావుకత్వం అంతా ఏమైపోయిందో తెలీదు. ఒక్కోసారి ప్రమాదాలకి దగ్గరగా నువ్వు వర్క్ చేయాల్సి వస్తోంది. ఇదంతా ఏమిటి శేఖర్? దీనికి మరో ప్రత్యామ్నాయం, పరిష్కారం లేదా?'' బేలగా అడిగిందామె...

'నీకెలా చెప్పగలనో అర్ధం కావడంలేదు కిరణ్. ఈ వృత్తిలో ఒక్కోసారి రిస్క్‌ను ఎదుర్కోవలసి రావచ్చు. కానీ.. ఎప్పుడూ కాదుగా...? నేనిప్పుడు కూడా నా వర్క్‌ను ప్రేమిస్తున్నాను. పైగా మంచి జీతం తీసుకుంటున్నాను. ఛానల్ యాజమాన్యానికి నేనంటే మంచి అభిప్రాయం, నా సమర్ధత మీద నమ్మకం ఉన్నాయి. నేనిచ్చిన కొన్ని 'స్కూప్'లు 'పరిశోధనాత్మక సమాచారం, క్లిప్పింగ్‌లు) ఎంత సెన్సేషన్ అయ్యాయో నీక్కూడా తెలుసు.

'అవన్నీ నిజమే శేఖర్.. కానీ నా మనసులో ఉన్న విషయాలు.. నీతో చెప్పుకోవాలనిపించింది... చెప్పాను... ఇంక ఏ నిర్ణయమైనా నీదే'

కిరణ్మయికి ఇంకేం సమాధానం చెప్పాలో అర్ధంకాక ఛానెల్ ఆఫీసుకి బయల్దేరాడు శేఖర్.

వాస్తవ పరిస్థితుల్ని కిరణ్మయి ఎందుకు అర్ధం చేసుకోదు..? వృత్తిపరంగా నిర్వహించే బాధ్యతలు స్వభావాన్ని మారుస్తాయా...? కిరణ్మయి ఆలోచనలు అర్ధరహితమా...? లేక తనే ఆమెను సరిగ్గా అర్ధం చేసుకోలేకపోతున్నాడా? లేక తను ఒక్కోసారి ప్రమాదాలకు దగ్గరగా వెళ్ళడం కిరణ్మయిని ఆందోళనకు గురిచేసి.. అదే ఆమె చేత ఆ విధంగా మాట్లాడిస్తోందా? ...అవును అదే కారణం కావచ్చు... వర్తమాన జీవన చిత్రం రక్తంతో తడిసిపోయి వెంటాడి వేధించే దృశ్యాలుగా మారుతోంది. తను ఈ వృత్తిలో ఉండడం వల్ల ఆ అలజడి తన జీవితంలో మరింత స్పష్టంగా ప్రతిఫలిస్తోంది. మరి దీనికి పరిష్కారం..? ఛానెల్ ఆఫీస్‌లో కూర్చుని ఆలోచిస్తున్న శేఖర్ అంతరంగం అశాంతికి గురైంది. ఈ పరిస్థితి ఇలాగే కొనసాగాలా..?

ఆలోచనల్లో మునిగివున్న శేఖర్‌కు హఠాత్తుగా ఓ విషయం గుర్తొచ్చింది. అవును.. తను ఆ సంగతి మరిచిపోయాడు. అదే ఈ సమస్యకు పరిష్కారం అవుతుందా..? చూద్దాం... తనకైతే ఈ వృత్తిపట్ల ఎటువంటి విముఖతా లేదు. కానీ తనకు అంతకంటే కిరణ్మయి ముఖ్యం... తన జీవితం ముఖ్యం... కానీ అది జరుగుతుందా?

పదిహేను రోజులు శేఖర్, కిరణ్మయిల జీవితాల్లో ఎటువంటి మార్పు లేకుండా స్తబ్దంగా గడిచిపోయాయి... ఆ తర్వాత ఓ రోజు...

శేఖర్ చేతిలో ఓ కవర్ పట్టుకుని కిరణ్మయి దగ్గరికొచ్చాడు. కవర్‌ను ఆమె చేతిలో ఉంచాడు.

కిరణ్మయి కవర్లో ఏముందో చూసింది. అది అపాయింట్‌మెంట్ ఆర్డర్.. శేఖర్‌ని నేషనల్ జియోగ్రాఫిక్ ఛానల్‌లో అసిస్టెంట్ కెమెరామెన్‌గా అపాయింట్ చేసుకున్నామని... జాయిన్ అవ్వమంటూ వచ్చిన ఆర్డర్...

''ఈ జాబ్‌కి అప్లై చేసి చాలా రోజులయింది కిరణ్... వస్తుందో.. రాదో..నన్న సందిగ్ధతతో నీకు చెప్పలేదు. సిడిల్లో పంపించిన నా వర్క్ వాళ్లకు నచ్చింది. ఇది నీకు సంతోషకరమైన వార్తేననుకుంటున్నాను.''

కిరణ్మయి కళ్ళల్లోని మెరుపు, మొహంలోని చిరునవ్వు శేఖర్‌కి అవునని సమాధానం చెప్పాయి.

''నేను కెమెరాని వదలనక్కర్లేదు... ఇక మీదట నా కెమెరాతో ప్రకృతిని ఆవిష్కరించే దిశగా నా ప్రయాణం సాగుతుంది. ఇంక నా కెమెరాలో దృశ్యాలు ఎంత మాత్రం కిరణ్మయిని వెంటాడి వేధించే దృశ్యాలు కాదు. మురిపించి మైమరిపించే దృశ్యాలే...! నేను వాస్తవానికి దూరంగా వెళ్తున్నానేమో తెలీదు.. కానీ ప్రకృతికి దగ్గరగా వెళ్ళబోతున్నాను. నా కిరణ్మయి కోసం... నా జీవితంలో నెలకొన్న స్తబ్దతని పారదోలడం కోసం... ఈ మార్పు నాకు అవసరం..''

ఆ రాత్రి శేఖర్ డైరీ రాయడం పూర్తి చేసి కిరణ్మయి వైపు చూశాడు. బెడ్ మీద హాయిగా నిద్రపోతున్న ఆమె మొహంలోని ప్రశాంతత, నిశ్చింత ఆ నిశ్శబ్ద సమయంలో అతడి మనసు నిండా ఆనందాన్ని నింపాయి.

★

## 'అతిథి' దేవోభవ

తెలుగు తెరపై కన్పించి వీక్షకుల నుంచి నీరాజనం అందుకునే తారలు ఇప్పుడు ఎక్కువైపోయారు. తాజాగా మహేష్‌బాబుతో కలిసి 'అతిథి'లో కన్పించి అలరించిన ఉత్తరాదిభామ అమృతారావు ప్రేక్షకుల అభిమానమే తనకు శ్రీరామరక్ష అంటోంది. 'అతిథిగా వచ్చిన వారిని దేవుడితో సమానంగా చూస్తారు. 'అతిథి' సినిమాతో తెలుగు జనం ఆదరాభిమానాలు అందుకోవడం చాలా సంతోషంగా ఉంది' అంటోంది అమృతారావ్.

